సాక్షి నంద్యాల

శనివారం, 8, ఏప్రిల్, 2023



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థాన అర్చకులు ఊయలసేవ నిర్వహించారు. అలాగే గ్రామ దేవత అంకాళమ్మకు పూజలు చేపట్టారు.



కొబ్బరికాయల సమర్పణ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవి అమ్మవారికి ఈనెల 11న కుంభోత్సవం నిర్వహిస్తుండటంతో సాత్వికబలి ఇచ్చేందుకు దేవస్థానం అధికారులు శుక్రవారం కొబ్బరికాయలు సమర్పించారు.



భక్తుల సేవలో..

మహానంది: మహానందీశ్వరుడి ఆలయ ప్రాంగణంలో భక్తుల కాళ్లు కాలకుండా మహానందికి చెందిన ఓ దాత విరాళంతో రూ. లక్ష విలువ చేసే కార్పెట్లను శుక్రవారం వేయించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:37	ఉ॥ 4:44
ఆదోని	సా॥ 6:40	ఉ॥ 4:47
నంద్యాల	సా॥ 6:37	ఉ॥ 4:47
ఆత్మకూరు	సా॥ 6:35	ఉ॥ 4:41
బనగానపల్లె	సా॥ 6:40	ఉ॥ 4:41

హదీస్ వెలుగు :

అల్లాహ్ అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు. చేసిన పాపాల నుంచి ముక్తి కోసం, కరుణ కోసం నిత్యం దువా చేస్తూ ఉండండి.

– పవిత్ర ఖురాన్



నంద్యాల రామనాథరెడ్డి నగర్‌లో ప్రజా స్పందన నమోదు చేస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, చిత్రంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తదితరులు



బనగానపల్లె ముత్తుమియ్యా కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



వెలుగోడులో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై మహిళను ఆరా తీస్తున్న శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

జగనన్న సైన్యం కదిలింది!

- 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం ప్రారంభం
- సంక్షేమాన్ని వివరించి భరోసా కల్పించిన ఎమ్మెల్యేలు
- ఇంటింటికీ 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు
- ఉత్సాహంగా పాల్గొన్న గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు

''అక్కా బాగున్నావా... అవ్వా ఆరోగ్యం ఎలా ఉంది.. తాతా అందరూ క్షేమంగా ఉన్నారా.. చెల్లీ బాగా చదువుకుంటున్నావా.. తమ్ముడూ సచివాలయ ఉద్యోగం వచ్చింది కదా పెళ్లి ఎప్పుడు చేసుకుంటావు.. అన్నా ఈ ఏడాది పంటలు బాగా పండాయి కదా.. ఏ మాత్రం ధర లభించింది.. అమ్మా ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా'' అంటూ ప్రజలతో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు మమేకమయ్యారు. ప్రజల యోగక్షేమాలు తెలుసుకోవడంతో పాటు టీడీపీ పాలనలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారో, వైఎస్సార్‌సీపీ సువర్ణ పాలన ఎలా సాగుతుందో అవగాహన కల్పిస్తున్నారు. 'జగనన్నే మా మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి మొదటి రోజు శుక్రవారం విశేష స్పందన లభించింది. వైఎస్సార్‌సీపీ పాలన బాగుందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజాప్రతినిధులకు ప్రజలు తెలిపారు.

నంద్యాల: జగనన్న ప్రభుత్వం పేదలకు చేసిన మేలును చెబుతూ.. గత ప్రభుత్వాలు ప్రజలను మోసం చేసిన తీరును వివరిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రతి ఇంటికి చేరువవుతున్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించారు. అలాగే ఇంటి యజమాని అంగీకారంతో ఇంటి తలుపునకు, సెల్‌ఫోన్‌కు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను అతికించారు. ప్రజల మొబైల్ నుంచి 82960 82960కు మిస్డ్‌కాల్ ఇప్పించి అనంతరం తిరిగి వచ్చే జగనన్న సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమం కింద గృహాల వద్దకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. ప్రతి ఒక్కరూ జగనన్న మాకు మంచి చేశారని చెబుతూ స్వచ్ఛందంగా 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించుకోవడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్సాహంగా ముందుకు సాగారు. నంద్యాల పట్టణంలోని రామనాథరెడ్డినగర్‌లో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజా మద్దతు పుస్తకంలో ప్రజల సంతృప్తి స్థాయిని నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ టీడీపీ నాయకులు గత ప్రభుత్వ మేనిఫెస్టో ఆన్‌లైన్‌లో కూడా లేకుండా చేశారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం ప్రజలకు ఏం చేశామో ఎమ్మెల్యేలను పంపి ప్రజలకు వివరిస్తున్నారని, ఇలాంటి కార్యక్రమం దేశంలో ఇప్పటి వరకు ఎక్కడా జగరలేదన్నారు. కార్యక్రమంలో నంద్యాల పట్టణం, గోస్పాడు, నంద్యాల మండలాల కన్వీనర్లు దాల్‌మిల్ అమీర్, సాయిరాంరెడ్డి, సలాముల్లా రాజశేఖర్‌రెడ్డి, బసవేశ్వరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, దేశం సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆలూరులో ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



కర్నూలు 19వ వార్డులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్న వృద్ధుడు, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య తదితరులు

పేదల కోసం సీఎం అహర్నిశలు కృషి

నందికొట్కూరు పట్టణంలోని 18వ వార్డులో ఎమ్మెల్యే ఆర్థర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల మద్దతుతో ఇంటి తలుపులకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్థర్ మాట్లాడుతూ సీఎం జగన్ పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ప్రజా స్పందన అపూర్వం

బనగానపల్లె పట్టణంలోని 9వ వార్డులో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఏపీఎస్ఐడీసీ చైర్మన్ కర్రా గిరిజ ఆధ్వర్యంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇళ్ల వద్దకు వెళ్లి గత టీడీపీ ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి మధ్య తేడాను వివరించి వారి మద్దతు కోరారు. ఈ సందర్భంగా కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ కులం, మతం, రాజకీయం చూడకుండా అర్హులందరికీ సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందజేయడంతో ప్రజలు చిరునవ్వుతో ఆహ్వానిస్తూ 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు తమ ఇళ్లకు అతికించుకుంటున్నారన్నారు.

దేశ చరిత్రలో ఇదే ప్రథమం

ఆళ్లగడ్డ పట్టణంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిలు జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలకు చేసిన మేలును వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అన్నీ నెరవేర్చి పాలకులు ప్రజల ముందుకెళ్లడం దేశ చరిత్రలో ఇదే ప్రథమమన్నారు.

పారదర్శక పాలనకు నిదర్శనం

శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడు మండల కేంద్రంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి జగనన్న మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రారంభించి లబ్ధి దారులతో మాట్లాడారు. పారదర్శక పాలనకు నిదర్శనంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, రమేష్, తిరుపంరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆలూరులోని కోయినగర్ కాలనీలో శుక్రవారం మండల కన్వీనర్ వీరేష్ ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తుంటే ఓర్వలేక ఆ పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అండగా ఉన్నది ఏ ప్రభుత్వమో ఒకసారి ఆలోచించాలని సూచించారు. కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి సోదరులు నారాయణస్వామి, శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్, ఎంపీపీ రంగమ్మ, కో ఆప్షన్ మెంబర్ బాషా, వైస్ ఎంపీపీ నాగవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీధర్, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విత్తనోత్పత్తికి నంద్యాల భూములు అనుకూలం



ఆర్ఎం శివరాసన్ కుటుంబీకులకు ప్రసాదాలు అందిస్తున్న పండితులు

మహానంది: విత్తనోత్పత్తికి నంద్యాల ప్రాంత భూములు ఎంతో అనువైనవని, ఇక్కడ ఉత్పత్తి చేసే విత్తనాలను కొనుగోలుకు వివిధ రాష్ట్రాల వారు ఆసక్తి చూపుతారని జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ (కేరళ, తమిళనాడు) రీజనల్ మేనేజర్ ఏ.శివరాసన్ పేర్కొన్నారు. మహానందీశ్వరుడి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఆయన మహానందికి వచ్చారు. దర్శనం అనంతరం ఆయన మాట్లాడుతూ నంద్యాల ప్రాంతంలోని పంట పొలాల నుంచి ఉత్పత్తి చేసే విత్తనాలు ఎంతో నాణ్యతగా ఉంటాయన్నారు. అలాగే నంద్యాల పరిసర ప్రాంతాల్లో తయారయ్యే జూట్‌కు పశ్చిమబెంగాల్‌లో మంచి ఆదరణ ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కేరళ, కర్ణాటకలో ఎస్ఎస్‌సీ యూనిట్లు ఉన్నాయన్నారు.

అన్నదాన పథకానికి రూ.2లక్షల విరాళం



దాత గోపాలకృష్ణయ్యకు మెమొంటో అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం పలువురు భక్తులు రూ.2 లక్షల విరాళాన్ని అందించారు. విజయవాడకు చెందిన బండి గోపాలకృష్ణయ్య కుటుంబీకులు రూ.1,00,116, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఏ.రామిరెడ్డి దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. విరాళాలు అందించిన దాతలకు దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

మే 25న సిల్వర్‌సెట్

కర్నూలు(సిటీ): సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజ్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే సిల్వర్‌సెట్‌ను మే నెల 25వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. https://sjgckurnool.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చే నెల 6వ తేదీ వరకు ఫీజు చెల్లింపునకు గడువు ఉంది. దరఖాస్తు చేసుకున్న వారందరికీ వచ్చే నెల 18వ తేదీన హాల్‌టిక్కెట్లు జారీ చేసి 25వ తేదీన కంప్యూటర్ బేస్డ్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. వివరాలకు హెల్ప్‌డెస్క్ (ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు) పనిదానాల్లో మాత్రమే 022-62507712 నంబర్‌ను సంప్రదించవచ్చు.

నేడు కూడా పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం ఈ నెల 8వ తేదీ కూడా కొనసాగనుంది. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 7 వరకు మాత్రమే పింఛన్ల పంపిణీ చేపట్టాల్సి ఉంది. అయితే అందరికీ పింఛన్లు అందించాలనే లక్ష్యంతో శనివారం కూడా పంపిణీ చేపట్టనున్నారు. కర్నూలు జిల్లాలో 2,38,448 పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయానికి 2,35,609 పింఛన్ల పంపిణీ పూర్తయింది. 98.81 శాతం పంపిణీతో కర్నూలు జిల్లా రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచింది. నంద్యాల జిల్లాలో 2,16,136 పింఛన్లకు నిధులు విడుదల కాగా.. 2,13,828 పింఛన్లు పంపిణీ చేశారు. 98.93 శాతం పంపిణీ నంద్యాల జిల్లా రాష్ట్రంలో 3వ స్థానం దక్కించుకుంది. ఇప్పటి వరకు పెన్షన్ అందని లబ్ధిదారులు ఈనెల 8న గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా తీసుకోవాలని అధికారులు సూచించారు.

సీమకు మరో మణిహారం

- నేడు కల్వకుర్తి–నంద్యాల జాతీయ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన
- నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి



నంద్యాల: తెలంగాణలోని కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి రాయలసీమకు మరో మణిహారం కానుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. ఈ రహదారి నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన జాతీయ రహదారి పూర్తయితే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రధానంగా పుణ్యక్షేత్రాలైన సంగమేశ్వరం, కొలనుభారతి, మహానంది, ఓంకారేశ్వరం, అహోబిలం, యాగంటి, పర్యాటక కేంద్రాలైన బెలూం గుహలు, నల్లమల జంగిల్ క్యాంపులు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ రహదారిని వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు వరకు పొడిగించారన్నారు. మరో ముఖ్యమైన రహదారి సూరత్–చెన్నై ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని, ఈ రహదారిని కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి జిల్లాల మీదుగా చెన్నై వరకు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. దీంతో దేశంలోని వివిధ ప్రాంతాలతో వాణిజ్య, సామాజిక, ఆర్థిక సంబంధాలు మెరుగుపడతాయని తెలిపారు.

తీర్థావళితో ముగిసిన బ్రహ్మోత్సవాలు



పార్వేట గుర్రంపై రంగనాథ స్వామిని ఊరేగింపుగా ఆలయానికి తెస్తున్న భక్తులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదో రోజు శనివారం స్వామివారికి వసంతోత్సవ (తీర్థావళి) కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారి ఆలయం వద్ద వడపప్పు, పానకం భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం భక్తులు రంగులబండిని కట్టి గ్రామంలో కోలాహలంగా రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాల మధ్య తీర్థావళి కార్యక్రమాన్ని జరుపుకున్నారు. సాయంత్రం స్వామివారికి మహానైవేద్యాన్ని పెట్టి బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ పూజారి ఈశ్వరరెడ్డి, ఈఓ వెంకటరమణ, చైర్మన్ ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

ఏడు మండలాల్లో తేలికపాటి వర్షాలు



కర్నూలు(అగ్రికల్చర్): ఉదయం నుంచి సాయంత్రం వరకు మండే ఎండలు, సాయంత్రానికి వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలోనే ఇటు కర్నూలు, అటు నంద్యాల జిల్లాల్లోనే ఉష్ణోగ్రత అధికంగా నమోదవుతుంది. కర్నూలు జిల్లాలో ఉష్ణోగ్రత 42 డిగ్రీలకు చేరుకుంది. కాగా గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఏడు మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. ఆదోనిలో 16.6 మి.మీ, నందవరంలో 6.4, దేవనకొండలో 4.2, పత్తికొండలో 4.2, ఎమ్మిగనూరులో 3.6, పెద్దకడుబూరులో 3.2, ఆస్పరిలో 1.3 మి.మీ., ప్రకారం వర్షపాతం నమోదైంది. రానున్న రెండు, మూడు రోజుల్లో జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉష్ణోగ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఆర్జిత అభిషేకాలు నిలుపుదల



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు ఆర్జిత అభిషేకాలు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న తెలిపారు. శుక్రవారం ఈఓ మాట్లాడుతూ రెండవ శనివారం, ఆదివారం ప్రభుత్వ సెలవు రోజులు కావడం, ఆ మరుసటి రోజు సోమవారం కావడంతో మూడు రోజుల పాటు శ్రీశైల క్షేత్రానికి భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు స్వామివారి ఆర్జిత అభిషేకాలు గర్భాలయ, సామూహిక అభిషేకాలు తాత్కాలికంగా మూడు రోజుల పాటు నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఆర్జిత అభిషేకాల టికెట్లు పొందిన వారికి మాత్రం యథావిధిగా అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.

విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట



ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: విద్య, వైద్య రంగాలకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామ సమీపాన కర్నూలు రహదారిలో రూ.36 కోట్లతో నిర్మిస్తున్న బీసీ బాలుర రెసిడెన్సియల్ స్కూలు, కళాశాల, రూ.7.80 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల, రూ.4 కోట్లతో నిర్మిస్తున్న ఎంఎస్ఎంఈ (టూల్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్) భవన నిర్మాణాలను మంత్రి బుగ్గన పరిశీలించారు. భవన నిర్మాణాలతో పాటు అయ్యలచెర్వు నుంచి కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయం వరకు రూ. సుమారు 20 కోట్లతో జరుగుతున్న నాల్గులైన్ల రహదారి పనులపై సంబంధిత కాంట్రాక్టర్, ఆర్ అండ్‌బీ అధికారులతో చర్చించి పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నిర్మించే స్థలాన్ని, రూ.కోటితో చేపట్టిన ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణ పనులను మంత్రి బుగ్గన పరిశీలించారు. మంత్రి వెంట తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైఎస్సార్ నాయకులు బాబుల్ రెడ్డి, నాగరాజు, దస్తగిరి, ఎద్దులన్న, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



హల్లెలూయా!

గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం కర్నూలు నగరంలోని ప్రేమగిరిలో సిలువ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

క్లుప్తంగా

గుర్తు తెలియని సాధువు మృతి



బనగానపల్లెరూరల్: స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో గుర్తు తెలియని సాధువు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు సుమారు 50 ఏళ్ల వయస్సు ఉన్న సాధువు యాగంటి క్షేత్రంలో భిక్షాటన చేస్తుండేవారు. అనారోగ్యం కారణంగా నాలుగురోజులుగా బనగానపల్లె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆవరణంలోనే ఉంటూ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


గౌస్‌మోయిద్దీన్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: విద్యుదాఘాతంతో గౌస్‌మోయిద్దీన్(19) అనే యువకుడు మృతి చెందాడు. ఈ దుర్ఘటన కడిమెట్ల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాబువలి, ఉసేన్‌బీ దంపతుల పెద్ద కుమారుడు గౌస్‌మోయిద్దీన్(19) ఇంటర్ వరకు చదువుకున్నాడు. తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటూ పనికి వెళ్తున్నాడు. చిన్న కుమారుడు మాబువలి కొత్తగా ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. ఇంటి ముందు ఉన్న వేప చెట్ల కొమ్మలను తొలగిస్తుండగా విద్యుత్ స్తంభానికి ఉన్న సర్వీస్ వైరుపై పడ్డాయి. సర్వీస్ వైరు తెగి పడగా.. గౌస్‌మోయిద్దీన్ దానిని తొలగించేందుకు యత్నిస్తూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు కర్రతో కొట్టడంతో కింద పడిపోయాడు. చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చేతికి వచ్చిన కుమారుడు కళ్ల ముందే మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ యూ. సునీల్‌కుమార్ తెలిపారు.

రచ్చమర్రిలో..

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని రచ్చమర్రి గ్రామంలో కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చిన్ననాగప్ప(40) శుక్రవారం ఉదయం స్నానం చేసి తడిగుడ్డలను ఆరవేయడానికి వెళ్లాడు. ఇనుప కడ్డీకి విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జిల్లాకు చేరిన పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ

కర్నూలు(సిటీ): పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు. రాత్రి పత్తికొండలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బస చేశారు. శనివారం ఉదయం పత్తికొండ, ఆలూరు, ఆదోని ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేయనున్నారు. సెక్రటరీతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారులందరూ పత్తికొండలోనే బస చేశారు.

వీధికుక్కల దాడి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆలూరు రూరల్: హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో బహిర్భూమికి వెళ్లిన వారిపై కుక్కలు దాడి చేశాయి. గాదిలింగ, సరోజమ్మలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం బళ్లారి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామ పంచాయతీ అధికారులు కుక్కల నియంత్రణకు చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


కర్నూలులో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు


ప్రేమగిరిలో ప్రార్థనలు చేస్తున్న మతపెద్దలు


యేసు విగ్రహం వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

సిలువను మోస్తూ.. యేసును స్తుతిస్తూ

గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సిలువను మోస్తూ ప్రదర్శనలు జరిపారు. క్రీస్తును స్తుతిస్తూ గీతాలు పాడారు. సిలువపై యేసు పలికిన ఏడుమాటలను మతపెద్దలు చదివి వినిపించారు. మానవాళి కోసం క్రీస్తు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. చర్చీల్లో చిన్నారులు, పెద్దలు, మహిళలు మోకరిల్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాధాతప్త హృదయాలను కాపాడి శాంతి సందేశాన్ని ఇచ్చిన మహనీయుడు యేసుక్రీస్తు అని పలువురు దైవజనులు కొనియాడారు. ఉదయం నుంచే చర్చీల వద్ద క్రైస్తవుల సందడి కనిపించింది.

– సాక్షి నెట్‌వర్క్


మద్దికెరలో సిలువ మోస్తూ ఊరేగింపు చేస్తున్న క్రైస్తవులు


యేసు నామ స్మరణ చేస్తున్న మహిళ


కర్నూలులో సిలువ జెండాతో చర్చికి వెళ్తున్న మహిళలు


గోస్పాడులో ఏసుక్రీస్తు నాటకంలో సిలువ వేస్తున్న దృశ్యం


నందికొట్కూరులో సిలువను మోస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్


కోవెలకుంట్లలో సిలువ మోస్తున్న క్రైస్తవులు


పాములపాడులో యేసు క్రీస్తును ప్రార్థిస్తున్న భక్తులు


ఆదోని మండలంలో చర్చి వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు


ఆళ్లగడ్డలో సందేశం ఇస్తున్న రెవరెండ్ ఏసురత్నం

ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించాం

- జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి



కర్నూలు(సెంట్రల్): కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించడం జీవితంలో మరచిపోలేనని బదిలీపై వెళ్లిన జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన బదిలీపై పశ్చిమ గోదావరి జిల్లాకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. తాను రెండు సార్లు కోవిడ్ బారిన పడినా ప్రజల ప్రాణాలు కాపాడేందుకు చర్యలు తీసుకున్నానన్నారు. కోవిడ్ అనంతరం భూముల రీసర్వేపై పూర్తి స్థాయిలో దృష్టి సారించడంతో రాష్ట్రంలోనే కర్నూలు మొదటి స్థానంలో ఉందన్నారు. మే నెలాఖరు నాటికీ జిల్లాలోని 404 గ్రామాల్లో డ్రోన్ ఫ్లై పూర్తవుతుందన్నారు. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ పార్కుకు 8800 ఎకరాల భూములు సేకరించామన్నారు. ఇందులో తన హయాంలో 1,600 ఎకరాల భూసేకరణ జరిగినట్లు చెప్పారు. భవిష్యత్‌లో ఆయా పరిశ్రమల ద్వారా యువకులకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కర్నూలు ఎయిర్‌పోర్టును మూడు నెలల్లో పూర్తి చేయడం సంతృప్తిని ఇచ్చినట్లు చెప్పారు. జిల్లాల విభజన తరువాత స్పందన సమస్యలను నేరుగా క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను తెలుసుకొని పరిష్కరించడం సంతృప్తికరంగా ఉందన్నారు.

ట్రాక్‌పై వృద్ధుడు.. అప్రమత్తమైన పైలెట్


నిలిచిపోయిన గూడ్స్ రైలు

పాణ్యం: పైలెట్ అప్రమత్తమై ఓ వృద్ధుడి ప్రాణాలు కాపాడాడు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రం పాణ్యంలోని రైల్వే స్టేషన్ నుంచి గూడ్స్ రైలు డోన్ వైపునకు బయలుదేరింది. కొద్ది దూరం వెళ్లిన తర్వాత ట్రాక్‌పై ఓ వృద్ధుడు పడుకుని ఉన్నాడు. గమనించిన పైలెట్ వెంటనే గూడ్స్‌ను ఆపాడు. స్వల్ప గాయాలైన వృద్ధుడిని 108వాహనంలో నంద్యాలకు తరలించారు. ఈ ఘటనతో రైళ్ల రాకపోకలు అరగంట పాటు నిలిచిపోయాయి. కాగా రైల్వే ట్రాక్‌పై పడుకున్న వృద్ధుడు భూపనపాడు గ్రామానికి చెందిన చిన్న రావన్నగా గుర్తించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై రైల్వే పోలీసులు ఆరాతీస్తున్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: జాతీయ రహదారిపై వెళ్లే కంటైనర్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడిన దొంగలను ఎస్పీ ఎదుట హాజరు పరిచారు. నిందితుల వివరాలను ఎస్పీ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన సునీల్ బెజవత్, జోటువ రమేష్ కర్నూలు – బెంగళూరు జాతీయ రహదారిపై డోన్ పరిధిలో వెళ్తున్న కంటైనర్‌లలో గత నెల 17 సిగరెట్ బాక్సులు, 65 సిల్వర్ మాక్స్ బ్లేడ్ బాక్సులను అపహరించారు. లారీ యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ప్యాపిలి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం ఓబులాపురం సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. రూ. మూడు లక్షల విలువైన సిగరెట్ బాక్సులు, బ్లేడ్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో డోన్, నంద్యాల డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, మహేశ్వరరెడ్డి, సీసీఎస్ సీఐ రామకృష్ణ, ఎస్ఐలు రమేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల వేళ..అడ్మిషన్ల గోల!

- కార్పొరేట్ కాలేజీల దందా
- విద్యార్థుల ఇళ్ల చుట్టూ పీఆర్వోల ప్రదక్షిణలు
- పట్టించుకోని అధికారులు

- కర్నూలు నగరంలోని బీ క్యాంపుకు చెందిన ఓ విద్యార్థి పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. పరీక్షలు పూర్తికాక ముందే ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ చేయించాలని ఓ కార్పొరేట్ విద్యా సంస్థ జేఈఈ కోచింగ్‌తో కలిపి రూ.1.50 లక్షల ఫీజుతో అడ్మిషన్ చేయించి, అడ్వాన్స్‌గా రూ.10 వేలు కట్టించుకుంది.
- నగరంలోని ఓ కార్పొరేట్ కాలేజీలో జూనియర్ అధ్యాపకులుగా 5 ఏళ్లుగా పని చేస్తున్న ఓ వ్యక్తి వచ్చే విద్యా సంవత్సరానికి 10 అడ్మిషన్లు చేయించాలని టార్గెట్ ఇచ్చారు. ఆయన తన టార్గెట్ రీచ్ అయ్యేందుకు తనకు పరిచయం ఉన్న స్కూళ్ల హెచ్ఎంలకు ఓ గిఫ్ట్ ఇచ్చి చేయించుకుంటున్నారు. అడ్వాన్స్‌గా సైతం తానే ఒక్కో విద్యార్థికి రూ.5 వేల నుంచి 10వేల వరకు చెల్లిస్తున్నారు.

కర్నూలు సిటీ: ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన తరువాత జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలు నిర్వహించాల్సి ఉంది. అయితే కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎక్కడా ఇంటర్మీడియెట్ బోర్డు ఆదేశాలు అమలు కావడం లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వివిధ కోర్సులకు కోచింగ్ ఇచ్చేటటువంటి సంస్థలు వాటికి గతంలో ఎప్పుడో..ఎక్కడో వచ్చిన ర్యాంకులను చూపుతున్నాయి. విద్యార్థుల నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా..ఫిర్యాదు చేస్తే చర్యలంటూ బోర్డు ప్రకటనలతో సరిపెట్టేస్తున్నారు.

కమీషన్లు ఇస్తామంటూ ఆఫర్లు

ఈ నెల 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు మొదలయ్యాయి. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తరుణంలో కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు చేయించేందుకు అధ్యాపకులను, పీఆర్ఓలను విద్యార్థుల ఇళ్ల చుట్టూ తిప్పుతున్నాయి. అడ్మిషన్లు చేయిస్తే కమీషన్ ఇస్తామని కొందరు ఉన్నత పాఠశాలలకు చెందిన టీచర్లు, ప్రధానోపాధ్యాయులను మభ్య పెడుతున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఏ గ్రూప్ క్యాటగిరి, చదువులో కాస్త ప్రతిభా తక్కువగా ఉండే విద్యార్థులను బి గ్రూప్ క్యాటగిరిగా విభజించి టార్గెట్లు ఇస్తున్నారు. అయితే మొదటి క్యాటగిరి కిందనే అధిక అడ్మిషన్లు చేయించాలని అధ్యాపకులపై ఒత్తిళ్ళు చేస్తున్నట్లు తెలిసింది. ఒక్కో అధ్యాపకునికి ఏ క్యాటగిరి కింద సైన్స్ గ్రూప్ అయితే 5 నుంచి 8 మంది, బిక్యాటగిరి కింద 3–5 అడ్మిషన్లు చేయాలని టార్గెట్స్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. విషయం తెలిసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. జేఈఈ/నీట్ పేరుతో కొన్ని విద్యా సంస్థలు ఎలాంటి అనుమతులు లేకుండానే లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం

వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు చేయించేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు ఆదేశాలు ఇస్తుంది. ఇంకా ఇప్పటి వరకు అయితే ఇవ్వలేదు. కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు అడ్మిషన్ల చేస్తున్నట్లు మా దృష్టికి అయితే వచ్చింది. తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– గురవయ్య శెట్టి, ఆర్ఐఓ

ఎల్లెల్సీ నీరు వృథా


హొళగుంద సెక్షన్‌లో వృథాగా పోతున్న ఎల్లెల్సీ నీరు

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) నీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎల్లెల్సీ సబ్ డివిజన్–4 హొళగుందకు సంబంధించి 195 కి.మీ పరిధిలో కాలువలో నీరు యూటీలపై నుంచి వంకలోకి వెళ్తున్నారు. సంబంధిత అధికారులు సిబ్బందితో అక్కడక్కడ మట్టిని, ఇసుకు బస్తాలను అడ్డుగా వేయించారు. అయినా నీటి ఉధృతికి బస్తాలు కొట్టుకుపోయాయి. ఎల్లెల్సీ సబ్‌డివిజన్ –3 పరిధిలోని 53, 54, 55 డిస్ట్రిబ్యూటరీలను మరింత ఎత్తి పంటలకు సాగు నీరవ్వాలని రైతులు కోరుతున్నారు. గతేడాది కూడా ఇదే ప్రాంతంలో సమస్య వచ్చిందని, నీటిని ఇలా వృథా చెయడం కన్నా డిస్ట్రిబ్యూటరీలు(డీపీ) లకు వదిలితే చేతకందే దశలో ఉన్న పంటకు జీవం పోసినట్లవుతుందని రైతులు చెబుతున్నారు. ఆ ప్రాంతంలో ఎల్లెల్సీ ఆధునికీకరణ పనులు జరగ లేదని, ఈ ఏడాది జరిగితే ఆ సమస్య ఉండబోదని సెక్షన్ ఆఫీసర్ గోపీచంద్ తెలిపారు. కాలువలో ఒక రకమైన చెట్లు పెరగడంతో సమస్య వస్తోందని చెప్పారు. ఎల్లెల్సీకి కర్ణాటక కోటా నీరు బంద్ అయ్యాయని, కాలువలో నీటి మట్టం తగ్గుతుందని, దీనిపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని ఆయన తెలిపారు.